

94.04 శాతం హాజరు

ఏపీ ఈఏపీ సెట్ సోమవారం ప్రారంభం కాగా 94.04 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 8లో▸



శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: క్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి.



సమ్మర్‌లో సరదాగా!

వేసవిలో చిన్నారుల సేవలో నిమగ్నమవుతూ వస్తోంది కళారాధన సాంస్కృతిక సంస్థ. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు



ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): వివిధ ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన ల్యాప్‌టాప్‌లను ఇద్దరు దివ్యాంగులకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అందజేశారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందజేస్తోందన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖసహాయ సంచాలకులు రయూస్ ఫాతిమా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం ధర్నా



ధర్నా చేస్తున్న ప్రజలు

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 19 రోజులు గడిచినప్పటికీ రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో ఎమ్మిగనూరు పట్టణం లక్ష్మీపేట వాసులు సోమవారం ధర్నా చేశారు. ప్రతి నెలా మొదటి వారంలోనే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ నెల ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడంతో తాము పస్తులుండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పని చేసుకొని బతికే తమకు రేషన్ బియ్యం పంపిణీ చేయకుంటే ఎలా అని లక్ష్మి, నర్సమ్మ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలైన తమకు సత్వరం రేషన్ బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 80 కేంద్రాలు ఏర్పాటు చేయగా మొదటి రోజు 3,436 మందికి గాను 2,248 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

సీఐడీ నుంచి 10 మంది వెనక్కి

కర్నూలు: సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన 10 మంది సిబ్బంది తిరిగి యథాస్థానానికి వచ్చారు. సోమవారం ఎస్పీ దగ్గర హాజరుకావడంతో తిరిగి వారికి పోస్టింగ్ కేటాయించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఓ మహిళా కానిస్టేబుల్, ఏడుగురు కానిస్టేబుళ్లు ఉన్నారు.

పొగాకును కొనుగోలు చేయాలి

నంద్యాల(అర్బన్): రైతులు పండించిన పొగాకు దిగుబడులను కంపెనీలు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పొగాకు బేళ్లను వెనక్కు పంపకుండా ఒప్పందం మేరకు క్వింటా రూ.18,500తో కొనుగోలు చేయాలన్నారు.

ఆశలు వర్షిస్తూ.. విత్తు వణికిస్తూ!

విత్తన పంపిణీలో అంతులేని నిర్లక్ష్యం

- వర్షాలు కురుస్తున్నా స్పందించని ప్రభుత్వం
- బకాయిలు చెల్లిస్తేనే విత్తన సరఫరా అంటున్న కంపెనీలు
- ఇప్పటి వరకు మొదలుకాని ప్రాసెసింగ్ ప్రక్రియ
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మే 15 నుంచే పంపిణీ
- ఇప్పుడు అరకొర కేటాయింపులతో సరి
- వర్షాలు కురుస్తుండటంతో దిక్కుతోచని రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ మంచుకొస్తోంది. వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ విత్తనం అందుబాటులో లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారుతోంది. గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు మే నెల 15 నుంచే విత్తన పంపిణీ జరిగింది. వర్షాలు పడిన వెంటనే విత్తనాల కోసం ఎదురు చూడకుండా సకాలంలో విత్తుకునే అవకాశాన్ని కల్పించింది. 2024 ఖరీఫ్ సీజన్ సమయంలో కూడా అప్పటి ప్రభుత్వం ముందస్తు చర్యల వల్ల సకాలంలో విత్తన పంపిణీ సాధ్యమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పూర్తి స్థాయిలో విత్తన పంపిణీపై దృష్టి సారించని పరిస్థితి. సబ్సిడీ పంపిణీలో వేరుశనగ, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు ప్రధానమైనవి. ఈ విత్తనాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ సరఫరాకు కూటమి ప్రభుత్వం టెండర్లు పిలిచి రేట్లు ఖరారు చేసినప్పటికీ సంబంధిత కంపెనీలు విత్తన సరఫరాకు సిద్ధంగా లేవని తెలుస్తోంది. ఇంతవరకు ప్రాసెసింగ్ ప్రక్రియనే మొదలు పెట్టలేదంటే పంపిణీ ఎలా సాధ్యమనే ప్రశ్న తలెత్తుతోంది. దీంతో రైతులు వేరుశనగ విత్తనం కాయల కోసం వ్యాపారులను ఆశ్రయించక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

2024–25 బకాయిలు చెల్లిస్తేనే విత్తన సరఫరా

రాష్ట్రం మొత్తం మీద ఏపీ సీడ్స్‌కు విత్తనాలు సరఫరా చేసే కంపెనీలు 45 వరకు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 3 కంపెనీలు సరఫరా చేయాల్సి ఉంది. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, రబీ సమయంలో సరఫరా చేసిన శనగ(బెంగాల్‌గ్రామ్),



కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో విత్తనాలు లేక ఖాళీగా ఏపీ సీడ్స్ గోదాములు

ఇతర విత్తనాలకు ఏపీ సీడ్స్ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. సబ్సిడీ మొత్తం ప్రభుత్వం నుంచి ఏపీ సీడ్స్‌కు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వం ఏపీసీడ్స్‌కు ఒక్క రూపాయి కూడా విదిల్చకపోవడం వల్ల సరఫరా చేసిన కంపెనీలకు నగదు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. బకాయిలు చెల్లిస్తేనే విత్తనాలు సరఫరా చేస్తామంటూ కంపెనీలు భీష్మించాయి.

విత్తనాల కోసం రైతులకు తప్పని తిప్పలు

ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా విత్తన పంపిణీ విషయంలో కూటమి ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ సారి సబ్సిడీ విత్తన పంపిణీ విషయమై కూటమి ప్రభుత్వం చేతులెత్తేసే అవకాశం ఉండటంతో రైతులు విత్తనాల కోసం దిక్కులు చూస్తున్నారు. ఇప్పటి వరకు వేరుశనగ క్వింటా ధర రూ.6,500 ఉండగా.. వ్యాపారులు ఉన్నట్లుండి ధరను పెంచేశారు. ఈ సారి విత్తనాల పంపిణీ దిశగా ప్రభుత్వ చర్యలు లేకపోవడం వ్యాపారులకు కలసి వస్తోంది. ధరలను అడ్డగోలుగా పెంచి దోపిడికి పాల్పడే ప్రమాదం ఏర్పడింది.

పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలకు సమస్య

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వరి సాగు ఎక్కువగా ఉన్నందున పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలకు డిమాండ్ ఉంది. నంద్యాల జిల్లాలో వరి ప్రధాన పంట. కర్నూలు జిల్లాలో కూడా వరి సాగవుతోంది. వరి నాట్లకు ముందు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, సన్‌హెంప్ విత్తనాలు విత్తుకొని 45 రోజుల సమయంలో దున్ని పొలంలో కలిపేస్తారు. ఇందువల్ల భూమికి అన్ని పోషకాలు కలిగిన ఎరువులు లభిస్తాయి. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు జిల్లాకు కనీసం 3,500 క్వింటాళ్లు అవసరం. అయితే ఏపీ సీడ్స్ వద్ద కేవలం 1000 క్వింటాళ్లు మాత్రమే ఉన్నాయి. కంపెనీలు విత్తన సరఫరా చేయడంలో చేతులెత్తేశాయి. ఇప్పటికే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల కోసం రైతులు వ్యవసాయ అధికారులు, ఏపీ సీడ్స్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో విత్తనాలను అందుబాటులో పెట్టకపోతే రైతులు రోడ్డెక్కే పరిస్థితి నెలకొంది.

అరకొరగా విత్తన కేటాయింపులు

- ఖరీఫ్‌లో వేరుశనగ ప్రధాన పంట. కర్నూలు జిల్లాలో 54,170 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 11,943 హెక్టార్ల వరకు సాగయ్యే అవకాశం ఉంది.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేపట్టేందుకు 32,181 క్వింటాళ్ల విత్తన కాయలు అవసరమని మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు నివేదించారు.
- ఆయా జిల్లాల అధికారులు వినతిని కూటమి ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది.
- ఉమ్మడి జిల్లాకు తూతూమంత్రంగా 11,108 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది.
- సాధారణంగా గత ఏడాది ఏఏ విత్తనం ఏ మేర పంపిణీ అయిందో దానికి అనుగుణంగా విత్తనాలను కేటాయిస్తారు.
- గత ఏడాది ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాకు 14,395 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 3,062.7 క్వింటాళ్ల ప్రకారం విత్తన పంపిణీ జరిగింది.
- కనీసం ఈ ప్రకారమైన కేటాయించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు కరువయ్యాయి.



- కర్నూలు జిల్లాకు 9,099, నంద్యాల జిల్లాకు 2,009 క్వింటాళ్లతో సరిపెట్టడం గమనార్హం.
- ఈ కేటాయింపులు చూసి అధికారులు పంపిణీ ఎలా చేపట్టాలోనని తలలు పట్టుకుంటున్నారు.

2020 నుంచి ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంపిణీ

సంవత్సరం	పంపిణీ చేసిన వేరుశనగ (క్వింటాళ్లలో)
2020	41,772.60
2021	23,725.50
2022	16,106.70
2023	18,680.70
2024	17,457.50
2025 కేటాయింపు	11,108.00

బ్లాక్‌లో కొనాల్సి వస్తుందేమో



ఐదు ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తాం. గత ఏడాది వరకు మే 15 నుంచే వేరుశనగ సహా అన్ని రకాల విత్తనాల పంపిణీ చేశారు. ముందస్తుగా విత్తనాలు సిద్ధం కావడంతో వర్షాలు కురిసిన వెంటనే సకాలంలో విత్తుకు అవకాశం ఉండేది. ఈ సారి సబ్సిడీపై విత్తనాల పంపిణీ జరుగుతుందో, లేదో తెలియని పరిస్థితి. ఇప్పటికీ వర్షాలు కురుస్తున్నాయి. విత్తనాల కోసం దిక్కుతు చూడాల్సి వస్తోంది. మరో నాలుగైదు రోజుల్లో విత్తనాలు అందుబాటులోకి రాకపోతే బ్లాక్‌లో కొనాల్సిందే.

– సత్యప్ప, మామిళ్లకుంట, తుగ్గలి మండలం

ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియదు



13 ఎకరాల్లో వరి, వేరుశనగ 8 ఎకరాల్లో సాగు చేస్తున్నాం. మామూలుగా అయితే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు వినియోగించం. మొదటిసారిగా వరి నాట్లకు ముందు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు విత్తుకోవాలనుకున్నాం. కానీ వ్యవసాయ శాఖ ఇంతవరకు విత్తనాల పంపిణీ చేపట్టలేదు. కేటాయింపులు అరకొరగా ఉన్నాయి. ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో చెప్పడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఏమీ చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితిని మొదటిసారి చూస్తున్నాం.

– కెంచప్ప, గజ్జెహళ్లి, హొళగొంద మండలం



పూజలందుకున్న శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ



అశేష జనవాహిని మధ్య అవ్వ రథోత్సవం

లక్ష్మమ్మవ్వ.. పాహిమాం

ఆదోని పట్టణంలో సోమవారం శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ వెండి రథోత్సవం కనుల పండువగా సాగింది. 'లక్ష్మమ్మవ్వ.. పాహిమాం' అంటూ ప్రజలు అవ్వవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– ఆదోని టౌన్

పది రోజులైనా ప్రజల అర్జీలు చూడరా?

- అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి

కర్నూలు(సెంట్రల్): పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన ప్రజల అర్జీలను కొన్ని శాఖల అధికారులు పది రోజులైనా చూడడంలేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఎస్‌డీసీ బీకే వెంకటేశ్వర్లు, అనురాధ హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..కర్నూలు సీడీపీఓ, ఆదోని మునిసిపల్ కమిషనర్, అర్బన్ తహసీల్దార్, లీగల్ మెట్రాలజీ డీడీలు వారం రోజుల నుంచి అర్జీలను చూడకపోవడం విడ్డూరమన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు అని, ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. సీఎంఓ నుంచి వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అర్జీల్లో కొన్ని...

- జాతీయ రహదారి 340సీ కింద బ్రిడ్జి నుంచి వ్యవసాయపొలాలకు వెళ్లేందుకు రహదారిని నిర్మించాలని కర్నూలు మండలం నూతనపల్లి రైతులు అర్జీ ఇచ్చారు.
- తన 6.20 ఎకరాల పొలాన్ని కొందరు ఆక్రమించుకొని ఇబ్బంది పెడుతున్నారని, తన భూమిని తనకు ఇప్పించాలని గోనెగొండ్ల మండలం పెద్ద నెలటూరుకు చెందిన చాకలి నరసింహులు అర్జీ ఇచ్చారు.
- తనకు మంత్రాలయం మండలం మాలపల్లిలో 58 సెంట్ల భూమి ఉందని, అది నిషేధిత జాబితాలో ఎవరూ అప్పు ఇవ్వడం లేదని, కుమార్తె పెళ్లి ఉందని, సమస్య పరిష్కరించాలని భీమన్న వినతి పత్రం అందజేశారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ఆదోనిలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం

- మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక ఏకగ్రీవం
- 36 మంది పాలకవర్గ సభ్యుల ఆమోదం
- ఛైర్‌పర్సన్‌గా సీహెచ్ లోకేశ్వరి

ఆదోని టౌన్: మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించింది. మొత్తం 36 మంది పాలకవర్గ సభ్యుల ఆమోదంతో ఎన్నిక ఏకగ్రీవంగా సాగింది. ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ సీహెచ్ లోక్వేరి ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఆదోని సబ్‌కలెక్టర్ భరద్వాజ్, ఎన్నికల అబ్జర్వర్, జాయింట్ కలెక్టర్ నవ్య ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిల్‌లో 42 మంది పాలకవర్గ సభ్యులు ఉండగా అందులో ఐదుగురు బీజేపీలోకి వెళ్లగా, ఒకరు టీడీపీ కౌన్సిలర్ ఉన్నారు. మిగిలిన 36 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లుగా ఉన్నాయి. సీహెచ్ లోకేశ్వరిని చైర్‌పర్సన్‌గా 36వ వార్డు కౌన్సిలర్ సందీప్‌రెడ్డి ప్రతిపాదించగా 40వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ బలపరిచారు. దీంతో సిహెచ్ లోకేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ప్రకటించారు. అబ్జర్వర్ అయిన జాయింట్ కలెక్టర్ నవ్య, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లు చైర్‌పర్సన్‌గా సి.హెచ్.లోకేశ్వరి ఎన్నికైనట్లు ఎన్నిక నియామక పత్రాన్ని అందజేశారు. కమిషనర్ ఎం.కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ప్రమాణస్వీకారం చేయించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బస్సులో....

ఎస్కేడీ కాలనీ జీరో రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి 35 మంది కౌన్సిలర్లు బస్సులో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు విచారణ అనంతరం కౌన్సిల్‌హాల్‌కు చేరుకున్నారు. కౌన్సిల్‌లో ఆల్ఫాబెట్ ప్రకారం సీట్లను కేటాయించారు. వారివారి సీట్లలో కౌన్సిలర్లు కూర్చొని ఎన్నిక ప్రక్రియలో పాల్గొన్నారు. ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సీహెచ్ లోకేశ్వరి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి మహాయోగి లక్ష్మమ్మవ్వను దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇంటికి ఆశీస్సులు పొందారు.

రుణపడి ఉంటా

వాల్మీకి వర్గానికి చెందిన తనను ఎంపిక చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి రుణపడి ఉంటానని మున్సిపల్ చైర్‌పర్సన్ సీహెచ్ లోక్వేరి తెలిపారు. ఆదోని ప్రాంతాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యతపరంగా పరిష్కరిస్తానని తెలిపారు.

ప్రలోభాలకు లొంగలేదు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో ఆదోని చరిత్ర తిరగరాసిందని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పాలకవర్గ సభ్యులు మాటకు కట్టుబడి వైఎస్సార్‌సీపీలోనే ఉంటూ చైర్ పర్సన్ ఎన్నికను ఏకగ్రీవంగా చేశారన్నారు. కూటమి నేతలు ప్రలోభాలకు గురిచేసినా లొంగలేదన్నారు. ఒక్కరు కూడా పార్టీని ఫిరాయించకుండా, ప్రలోభాలకు లొంగకుండా సత్తా చాటారన్నారు.



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో నూతన చైర్‌పర్సన్ లోకేశ్వరి, పాలకవర్గ సభ్యులు



చైర్‌పర్సన్ లోకేశ్వరితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కమిషనర్

జిల్లాలో విస్తారంగా వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు మంత్రాలయం, చిప్పగిరి మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం మీద 12.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షాలతోపాటు గాలుల తీవ్రతతో జిల్లాలో అరటి, మునగ పంటలకు నష్టం జరిగింది. అయితే ఉద్యాన అధికారులు మాత్రం అరటి ఒక హెక్టారు, మునగ ఒక హెక్టారులో మాత్రమే దెబ్బతిన్నట్లుగా తేల్చారు.

జీడీపీలోకి వరద నీరు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్ట్ (జీడీపీ)లోకి వరద నీరు వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ ఆలీ ఆదివారం తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు దాదాపు 880 క్యూసెక్కుల వరద నీరు వచ్చి జీడీపీలోకి చేరిందన్నారు. ప్రస్తుతం జీడీపీలో ఒక టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. కాగా.. గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు 4.5 టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం ఉంది.



గాజులదిన్నె ప్రాజెక్ట్‌లో నిల్వ ఉన్న నీరు

మోసం చేశారు.. న్యాయం చేయండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు
- పీజీఆర్ఎస్‌కు 128 ఫిర్యాదులు

కర్నూలు: నమ్మించి మోసం చేశారని, తమకు న్యాయం చేయాలని ప్రజలు సోమవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కోరారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యలపై వినతులను స్వీకరించి వారితో ఎస్పీ మాట్లాడారు. మొత్తం 128 ఫిర్యాదులు రాగా.. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐలు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

జీతాలు కూడా ఇవ్వకుండా..

వెల్దుర్తి, చిట్యాల, సూదేపల్లె, అమకతాడు పాఠశాలల్లో అటెండర్లు, రికార్డు అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు జొహరాపురానికి చెందిన శ్రీనివాసులు, కృష్ణగిరి గ్రామానికి చెందిన ఆవుల రామాంజనేయులు నమ్మించారు. మొత్తం ఏడుగురు నుంచి రూ.10 లక్షలు డబ్బులు తీసుకుని నకిలీ పత్రాలు సృష్టించారు. ఏడు నెలల పాటు ఆయా పాఠశాలల్లో పని చేయించుకుని జీతాలు కూడా ఇవ్వకుండా మోసం చేశారని డోన్ మండలానికి చెందిన ఎరుకలి శేషన్న సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మోసాల్లో కొన్ని..

- ఓర్వకల్లు మండలం కన్నమడకల గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యాపారి 95 కిలోల నకిలీ విత్తనాలు ఇచ్చి రైతులను మోసం చేశాడని వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి గ్రామానికి చెందిన నాగమల్లారెడ్డి ఫిర్యాదు చేశారు.
- ఇల్లు కట్టిస్తామని చెప్పి ఒక వ్యక్తి అడ్వాన్స్‌గా డబ్బులు తీసుకుని మోసం చేశాడని గూడూరుకు చెందిన యుగంధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు.
- తమ్ముడు విరుపాక్షితో కలసి డబ్బులు అవసరముందని, బంగారు ఆభరణాలు తీసుకెళ్లి తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాం. తిరిగి రుణం చెల్లించడానికి వెళ్లినప్పుడు బంగారు ఆభరణాలు గతంలోనే రిలీజ్ చేసినట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారని, సంఘటనపై విచారణ జరిపి తగు న్యాయం చేయాల్సిందిగా కర్నూలు మండలం నిడ్జూరు గ్రామానికి చెందిన నాగేశ్వర రెడ్డి ఫిర్యాదు చేశారు.
- కర్నూలు మార్కెట్ యార్డులో 50 మంది కమీషన్ ఏజెంట్ల నుంచి రూ.1.80 కోట్లు విలువ చేసే ఉల్లి సరుకు తీసుకుని ఆనియన్ ట్రేడర్స్ వారు డబ్బులు ఇవ్వడం లేదని కర్నూలు బుధవారపేటకు చెందిన సాంబశివుడు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా


బాలిక ప్రాణం తీసిన నీటి గచ్చు

కోడుమూరు రూరల్: నీటి గచ్చు ఐదేళ్ల బాలిక ప్రాణం తీసింది. ఈ దుర్ఘటన కోడుమూరు మండలం వర్కూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లక్కసాగరం రామాంజినేయులుకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. నాల్గవ కుమార్తె గాయత్రి (5)ని తోటి పిల్లలతో పాటు ఎప్పటిలాగే ఇంట్లో వదిలి తండ్రి రామాంజినేయులు పొలం పనులకు వెళ్లాడు. అయితే బాలిక గాయత్రి ఆటలాడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గచ్చులో పడిపోయింది. గాయత్రి కన్పించకపోవడంతో మిగిలిన పిల్లలు చుట్టుపక్కల వెతికి ఇంటిలోని గచ్చులో చూశారు. అప్పటికే బాలిక అపస్మారక స్థితికి చేరుకుంది. విషయం తెలుసుకున్న తండ్రి రామాంజినేయులు ఇంటికి చేరుకుని పాపను బతికించుకునేందుకు కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికీ లాభం లేకపోయింది. అప్పటికే బాలిక మృతిచెందినట్లు వైద్యులు చెప్పడంతో రోదిస్తూ గ్రామాన్ని చేరుకున్నారు.

పిడుగుపాటుతో 18 మేకలు మృతి

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి పిడుగుపాటుకు గురై 18 మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కొరవన్నగారి తిక్కయ్యకు చెందిన 3, కప్పట్రాళ్ల రాందాసుకు చెందిన 4, చింతకుంట నరసయ్యకు చెందిన 3, జెల్లీ గోకర్లకు చెందిన 4, జెల్లీ చిన్నలక్ష్మన్నకు చెందిన 4 మేకలు మృతిచెందాయి. రాత్రిపూట పొలంలో ఆపిన సమయంలో పిడుగు పడడంతో మేకలు మృతిచెందాయని గొర్రెల కాపరులు చెప్పారు. మేకల మృతితో దాదాపు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


గిడ్డిగారి ప్రకాష్ (ఫైల్)

దేవనకొండ: అప్పుల బాధతో దేవనకొండకు చెందిన గిడ్డిగారి ప్రకాష్(48) అనే రైతు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న మూడు ఎకరాల పొలంలో పంటలు పండిస్తూనే సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రకాష్ జీవనం సాగించేవాడు. గత రెండు సంవత్సరాల నుంచి పంటలు సరిగా పండలేదు. ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి దాదాపు రూ.15 లక్షలు దాకా అప్పులపాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక నిత్యం సతమతమవుతూ ఉండేవాడు. భార్య పిల్లలు బంధువుల శుభకార్యానికి వెళ్లగా ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా శవమై వేలాడుతున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు ఇచ్చారు. పోలీసులు వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


చరణ్ (ఫైల్)

ప్యాపిలి: మండల పరిధిలోని ఎస్ రంగాపురంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామాంజనేయులు, సునీతల కుమారుడు చరణ్ (10) సోమవారం ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదివిన చరణ్.. వేసవి సెలవులు కావడంతో తోటి మిత్రులతో కలసి ప్రతిరోజూ గ్రామ శివారులోని కుంటలో ఈత నేర్చుకునేవాడు. రోజులాగే సోమవారం కూడా ఈతకు వెళ్లాడు. నీటిలో మునిగిపోకుండా వీపునకు ప్లాస్టిక్ డబ్బా కట్టుకుని కాసేపు ఈత కొట్టాడు. తర్వాత ప్లాస్టిక్ డబ్బా తొలగించి కుంటలోకి దూకి బయటకు రాలేకపోయాడు. కొద్ది సేపటి తర్వాత అదే కుంటలో ఈత కొడుతున్న కొందరు అడుగున తమకు ఏదో తగులుతోందని గుర్తించారు. వెంటనే అందరూ కలిసి అడుగున ఉన్న చరణ్‌ను బయటకు తీశారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న బాలుడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.


ఆధునిక డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు


కోలాటం నేర్చుకుంటున్న చిన్నారులు


చెస్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్

సమ్మర్‌లో సరదాగా!

సమ్మర్ స్పెషల్

- 'కళారాధన' ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు
- 25 ఏళ్లుగా పేద విద్యార్థులకు బాసటగా కళారాధన

ఒకటి రెండు కాదు ఏకంగా 25 ఏళ్లుగా ఏటా వేసవిలో చిన్నారుల సేవలో నిమగ్నమవుతూ వస్తోంది కళారాధన సాంస్కృతిక సంస్థ. సేవే లక్ష్యంగా ఏర్పడిన ఈ సంస్థ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తోంది. ఆటపాటలతో పాటు క్రీడలు, లలిత కళల్లోనూ రాణించేలా తర్ఫీదునిస్తోంది. ఈ ఏడాది దాదాపు 600 మందికి విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచుతోంది. నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌లో ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు వేసవి లలిత కళల శిక్షణా శిబిరం జోరుగా, హుషారుగా సాగుతోంది.

నంద్యాల(వ్యవసాయం): లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్, ఐఎంఏ సహకారంతో 2000 సంవత్సరంలో కళారాధన సంస్థను స్థాపించి అధ్యక్షుడిగా డాక్టర్ మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రవికృష్ణ నియమితులయ్యారు. అప్పటి నుంచి ఏటా మే నెలలో వేసవి లలిత కళల శిక్షణా శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. మొదట్లో రామకృష్ణ విద్యాలయంలో జరిగే వేసవి శిబిరాన్ని 2012లో నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌కు మార్చారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచి సృజనకు పదును పెట్టేందుకు కళారాధన సంస్థ వినూత్న కార్యక్రమాలను చేపడుతూ వస్తోంది. పలు సంస్థలు, వైద్యులు, ఉద్యోగుల సహకారంతో ఎంతోమందికి ఉచిత శిక్షణ అందిస్తూ కళారాధన తన ప్రత్యేకతను చాటుకుంది. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో కొందరు ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్లలో డ్యాన్స్ మాస్టర్లుగా, కోచ్‌లుగా రాణిస్తున్నారు.


కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు


తైక్వాండో శిక్షణ పొందుతున్న చిన్నారులు

వివిధ రంగాల్లో శిక్షణ

చదరంగం, ఆధునిక, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, శారీ పెయింటింగ్, తైక్వాండో, శాస్త్రీయ సంగీతం, మిమిక్రీ, వాయిద్య సంగీతం, భగవద్గీత, తెలుగు పద్యాలు, కీబోర్డు, కబడ్డీ, కర్రసాము, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర లలిత కళల్లో శిక్షణ ఇస్తున్నారు. దాదాపు 22 మంది కోచ్‌లు ఎలాంటి ఫీజు తీసుకోకుండా శిక్షణ ఇస్తున్నారు.

జూన్‌లో ప్రదర్శన

ఈ వేసవి లలిత కళల శిక్షణా శిబిరం జూన్ మొదటి వారంలో ముగుస్తుంది. ఇందులో ప్రతిభ చూపిన వారికి జూన్ మొదటి వారంలో టౌన్‌హాల్‌లో జరిగే కార్యక్రమంలో ప్రదర్శన ఇచ్చే అవకాశం కల్పిస్తారు. ఈ శిబిరానికి ఏటా ఆదరణ పెరుగుతోంది.

ఏటా పెరుగుతున్న ఆదరణ



పేద విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, విజ్ఞానాన్ని వెలికి తీయడం కోసమే కళారాధన సంస్థ ఉచితంగా పని చేస్తోంది. మెరుగైన సేవలను అందిస్తుండటంతో ఏటా చిన్నారుల నుంచి ఆదరణ పెరుగుతోంది. శిబిరంలో శిక్షణ పొందినంత మాత్రాన పూర్తిగా రాదు. కానీ చిన్నారుల్లో ఆసక్తి, సృజనాత్మకత, విజ్ఞానం పెంచడమే మా లక్ష్యం.
– డాక్టర్ రవికృష్ణ, కళారాధన ప్రధాన కార్యదర్శి

నేర్పిస్తున్నందుకు తృప్తిగా ఉంది



16 ఏళ్ల నుంచి ఆధునిక నృత్యంలో శిక్షణ ఇస్తున్నాను. ఈ శిబిరంలో శిక్షణ పొందిన వారు కొందరు డ్యాన్స్ అకాడమీలను స్థాపించుకున్నారు. మరికొందరు ప్రైవేటు విద్యాసంస్థల్లో డ్యాన్స్ మాస్టర్లుగా ఉపాధి పొందుతున్నారు. ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో తృప్తిగా ఉంది.
– రాజాహుసేన్, డ్యాన్స్ మాస్టర్

నృత్యం నేర్చుకుంటున్నా



ఆరేళ్ల నుంచి వేసవిలో నృత్యం నేర్చుకుంటున్నాను. ఎలాంటి ఫీజు తీసుకోవడం లేదు. బాగా నేర్పుతున్నారు. జూన్‌లో ప్రదర్శన ఇచ్చే అవకాశం ఉంటుందంటా. అందుకే బాగా నేర్చుకుంటున్నాను.
– గోవర్ధిని, శిక్షణ పొందుతున్న విద్యార్థిని

భవిష్యత్తులోనూ నేర్పిస్తా



ఎక్కువ మంది చిన్నారులు ఆధునిక నృత్యంపైనే ఆసక్తి చూపుతున్నారు. నాలుగైదేళ్ల చిన్నారులు కూడా హుషారుగా, ఎంతో జోష్‌తో పాల్గొంటున్నారు. ఫీజు లేకపోయినా సరే చిన్నారులకు నేర్పుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. కాబట్టి మున్ముందు కూడా చిన్నారులకు డ్యాన్స్ నేర్పిస్తా.
– డాక్టర్ లలితాసరస్వతి, భరతనాట్యం డ్యాన్స్ మాస్టర్


విద్యార్థులకు పెయింటింగ్ నేర్పిస్తున్న కోచ్ గణేష్


డ్రాయింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు

వాల్మీకి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం


వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: ఎమ్మిగనూరులో నిర్వహించిన కర్నూలు జిల్లా వాల్మీకి ఉద్యోగుల సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ వాల్మీకి విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తామని, వారు భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదిగేలా చూస్తామన్నారు. వాల్మీకి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి వారు అభివృద్ధి వైపు నడిచేలా చూస్తామన్నారు. గౌరవాధ్యక్షులుగా కర్నూలుకు చెందిన టి.బాలవెంకటేశ్వర్లు (రిటైర్డ్ ఉద్యోగి), అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన బి.మల్లన్న, (ఏడీ, వెటర్నరీశాఖ), ప్రధాన కార్యదర్శిగా ఆదోనికి చెందిన బి.సుధాకర్‌బాబు (ఉపాధ్యాయుడు), కోశాధికారిగా కోసిగికి చెందిన ఎస్.వెంకటరెడ్డి (ఉపాధ్యాయుడు), ఇతర సలహాదారులు, ఉపాధ్యక్షులు, అదనపు కార్యదర్శులు, కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు. వాల్మీకి ఉద్యోగ సంఘం గౌరవ సలహాదారుడు వెంకన్న, ఉపాధ్యక్షుడు హుసేని, ఇతర నాయకులు పులుసు నారాయణ, తిమ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, రఘునాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 94.04 శాతం హాజరు

- సమయానికి చేరుకోలేక వెనుదిరిగిన ఇద్దరు విద్యార్థులు


విద్యార్థినుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: ఏపీ ఈఏపీ సెట్ సోమవారం ప్రారంభం కాగా 94.04 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో మూడు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 3,190 మందికిగాను 3,000 మంది (94.04 శాతం) హాజరయ్యారు. కర్నూలు నగరంలో 7 కేంద్రాలు, ఎమ్మిగనూరు, ఆదోనిలలో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో ఉదయం సెషన్ పరీక్షకు 1,597 మందికిగాను 1,492 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన పరీక్షకు 1,593 మందికిగాను 1,508 మంది హాజరయ్యారు. నంద్యాల జిల్లాలో 3 కేంద్రాలలో ఉదయం సెషన్‌లో 713 మందికి 659 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 711 మందికిగాను 659 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కర్నూలు నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడి జయకేతనం

- మద్దికెర ఉపసర్పంచ్‌గా కవిరెడ్డి కృష్ణ


ఉపసర్పంచ్‌గా ఎన్నికైన కవిరెడ్డి కృష్ణతో వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్దికెర: వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన కవిరెడ్డి కృష్ణ మద్దికెర ఉపసర్పంచ్‌గా సోమవారం ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారి రంగస్వామి ప్రకటించారు. పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించగా 18 పంచాయతీ సభ్యులకు గాను 14 మంది హాజరయ్యారు. ఉపసర్పంచ్‌గా కవిరెడ్డి కృష్ణను సభ్యులు కోలి మల్లికార్జున ప్రతిపాదించగా 12 మంది చేతులెత్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ సుహాసిని, కార్యదర్శి శివకుమార్ సభ్యులు బాలచంద్ర, వరప్రసాద్, కిట్టి, సుధాకర్, జంబునాథ్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో సంబరాలు

ఉప సర్పంచ్‌గా కవిరెడ్డి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్‌ను ఘనంగా సన్మానించి గ్రామ వీధులు గుండా ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శాంతన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఆంజనేయులు, కృష్ణ, మంజునాథ్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో డిప్లామా కోర్సులు

- దరఖాస్తుకు జూన్ 1 వరకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో మూడు సంవత్సరాల డిప్లామా కోర్సులో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు నాగరాజరావు తెలిపారు. మూడేళ్ల కోర్సుకు కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. 10వ తరగతి పాస్ అయిన అభ్యర్థులకు మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుకు జూన్ నెల 1వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఐటీఐ పాస్ అయిన వారు నేరుగా రెండవ సంవత్సరంలో చేరే అవకాశం ఉందన్నారు. ప్రతినెలా రూ.2,500 స్టైఫండ్ అందుతుందని.. కోర్సు పూర్తయ్యాక నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చన్నారు. వివరాలకు 9866169908, 9010243054 నెంబర్లను సంప్రదించాలన్నారు. సమాచారానికి www.lihtvgr. com వెబ్‌సైట్ సందర్శించవచ్చని పేర్కొన్నారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఫిబ్రవరి/మార్చి నెలల్లో జరిగిన డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ (2015, 2016, 2017,2018) పరీక్షల ఫలితాలు విడుదల అయ్యాయి. వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉన్నాయని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

22న కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(అర్బన్): కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో అందించనున్నట్లు జిల్లా కురువ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఈ పురస్కారాలను అందిస్తున్నామన్నారు. ఎంపికైన విద్యార్థులందరికీ జ్ఞాపిక, సర్టిఫికెట్లు, నగదు బహుమతులను అందిస్తామన్నారు. సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ఉపాధ్యక్షులు ధనుంజయ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భువనేంద్రుల ఆరాధన


భువనేంద్రుల బృందావన సేవలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: మధ్వమత పూర్వపు పీఠాధిపతి భువనేంద్రుల ఆరాధన వేడుక వైభవంగా జరిగింది. తెలంగాణలోని రాజోలి గ్రామంలో క్షేత్రంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో వేడుకలు చేపట్టారు. ముందుగా భువనేంద్ర తీర్థుల మూల బృందావనానికి శాస్త్రోక్తంగా విశేష పూజలు చేశారు. అక్కడే శ్రీమఠం రాములోరి సంస్థాన పూజలు నిర్వహించారు. ఈ ఆరాధన వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలో పండిత కేసరి రాజా ఎస్. గిరియాచార్, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి


సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ

బొమ్మలసత్రం: ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అడిషనల్ ఎస్పీకి 67 వినతులను అందించారు. కొన్ని సమస్యలను ఆయన ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అన్నదమ్ముల ఆస్తి తగాదాలు, అత్తింటి వేధింపులు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులను త్వరగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ జయరాముడు పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్



అరెస్టు చేసిన నిందితులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

హాలహర్వి: హత్య కేసులో ఐదుగురు నిందితులను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. హాలహర్వి పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్ చేసిన నిందితులను చూపుతూ సీఐ వివరాలను వెల్లడించారు. అమృతాపురం గ్రామంలో గత నెల 25న కంటినేని పెద్ద వెంకటేశులు హత్యకు గురి కాగా నిందితుడు సోమన్నను ఇప్పటికే అరెస్టు చేశామన్నారు. కుటుంబ కలహాల కారణంగా కంటినేని పెద్ద వెంకటేశులను హతమార్చినట్లు సోమన్న ఒప్పుకున్నారన్నారు. హత్యలో భాగస్వాములైన హొళగుంద గ్రామస్తులు చాకలి నాగరాజు, నటరాజగౌడ, కర్ణాటక రాష్ట్రం ఉత్తనూరుకు చెందిన భోగప్ప, ధనుంజయ, దళిత ఈరన్నను విరుపాపురం గ్రామ శివారులోని బల్గోట బసవేశ్వర ఆలయం వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుల స్టేట్‌మెంట్లను రికార్డు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ తెలిపారు. హాలహర్వి ఎస్ఐ చంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ బదిలీలకు పచ్చజెండా

ఒకేస్టేషన్‌లో ఐదేళ్లకు పైగా పనిచేస్తుంటే బదిలీ తప్పనిసరి

- జీరో సర్వీస్ ఉద్యోగులు, అధికారుల రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం
- కూటమి పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు
- సిపారసు లెటర్లకు రూ.20 వేల నుంచి రూ.50వేల వసూలు
- వివిధ శాఖల్లో బదిలీలకు షెడ్యూల్ ఖరారు

కర్నూలు(అగ్రికల్చర్): బదిలీలకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లో హడావుడి మొదలైంది. మంచి పోస్టింగ్ కోసం కొందరు అధికారులు కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు.. నియోజకవర్గ ఇన్‌చార్జీల వద్దకు క్యూకడుతున్నారు. జూన్ 2వ తేదీలోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే వివిధ శాఖలు బదిలీల కోసం షెడ్యూల్‌ను ఖరారు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో బదిలీల పర్వం కూటమి పార్టీల నేతలకు ఆదాయవనరుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కోరుకున్న చోటుకు బదిలీ కావడానికి అవసరమైన సిపారస్సు లెటర్ ఇచ్చేందుకు కూటమి పార్టీల నేతలు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు తీసుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. ఒకే స్టేషన్‌లో ఐదేళ్లకు పైబడి పని చేస్తున్న వారికి బదిలీ తప్పనిసరి. అయితే జీరో సర్వీస్ ఉన్న వారు కూడా రిక్వెస్ట్‌పై బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇదే ఉద్యోగులు, అధికారుల్లో కోరుకున్న చోటుకు బదిలీ అయ్యేందుకు ఆశలు రేపింది. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఫోకల్ స్థానానికి బదిలీ అయ్యేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నట్లు సమాచారం.

పశుసంవర్ధక శాఖలో రాజకీయ సిఫార్సులదే పైచేయి

పశుసంవర్ధక శాఖలో ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయిలో వెటర్నరీ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్ల బదిలీల ప్రక్రియ జరుగనుంది. లైవ్‌స్టాక్ అసిస్టెంటు మొదలుకొని అసిస్టెంటు డైరెక్టర్ స్థాయి వరకు ఈ నెల 28న డైరెక్టరేట్‌లో బదిలీలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కూటమి పార్టీల నేతల(మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ, నియోజక వర్గం ఇన్‌చార్జీలు) సిఫారసు లెటర్ల కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 50 మందికిపైగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు ఒకేస్టేషన్‌లో 5 ఏళ్లకుపైగా పనిచేస్తున్నారు. వీరందరికీ బదిలీ తప్పనిసరి కానుంది.

26న వ్యవసాయ శాఖలో బదిలీలు

వ్యవసాయ శాఖలో మండల వ్యవసాయ అధికారులు, పరిపాలన అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, ఏడీల బదిలీలు జోనల్ స్థాయిలో ఈనెల 26న అనంతపురంలో నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదేళ్ల పైబడి ఒకే స్టేషన్‌లో పనిచేసే ఏవో, ఏడీఏలు 35 మంది వరకు ఉన్నారు. ఆదాయం వచ్చే మండలాలు, సబ్ డివిజన్‌ల కోసం ఏవో, ఏడీలు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల చుట్టు తిరుగుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో బదిలీలు శాఖాపరంగా కాకుండా, రాజకీయ బదిలీలుగా చర్చ జరుగుతోంది.

అన్ని శాఖల్లో బదిలీల వేడి

ట్రెజరీ, స్టేట్ ఆడిట్, ఉద్యానశాఖ, సహకార శాఖ, మార్కెటింగ్ శాఖల్లోను బదిలీల హడావుడి మొదలైంది. అన్ని శాఖల ఉద్యోగులు, అధికారులు బదిలీ కోసం కూటమి పార్టీల నేతలను సంప్రదిస్తుండటం గమనార్హం. ఇదే అదనుగా కోరుకున్న చోటుకు బదిలీకి సిఫారసు చేసేందుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.